www.siddipetpower.com


# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 202 | హైదరాబాద్ | గురువారం | 13-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## నన్ను క్షమించాలి.. ఇకపై ఇలాంటి పొరపాటు చేయను



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో సినీనటుడు ప్రకాశ్ రాజ్ బుధవారం సాయంత్రం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరయ్యారు. సీఐడీ కార్యాలయంలో అధికారులు ఆయన్ని పలు కోణాల్లో ప్రశ్నించినట్టు సమాచారం. విచారణ అనంతరం ప్రకాశ్ రాజ్ మీడియాతో మాట్లాడారు. "2016లో ఓ యాప్‌నకు ప్రమోషన్ చేశా. ఆ యాప్.. 2017లో బెట్టింగ్ యాప్‌గా రూపాంతరం చెందింది. నా ఒప్పం దాన్ని అప్పుడు రద్దు చేసుకున్నా. తెలిసి చేసినా.. తెలియక చేసినా తప్పే కాబట్టి దీనిపై నేను క్షమాపణ కోరుతున్నా. సిట్ అధికారులకు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డాక్యుమెంట్స్, బ్యాంకు లావాదేవీలు అందజేశా. ఎంతోమంది యువత బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నారు. వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. కష్టపడితేనే ప్రతిఫలం ఉంటుంది.. కష్టపడితేనే డబ్బులు వస్తాయి కాబట్టీ అందరం కష్టపడి పని చేసుకుందాం. ఈ విషయంలో నన్ను క్షమించాలి. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చేయను" అని ప్రకాశ్ రాజ్ తెలిపారు.



## ఇదేనా బంగారు తెలంగాణ?..

### రెండు ప్రభుత్వాల పాలనలో మార్పు లేదు

- గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తేడా లేదన్న కవిత
- నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు లేవని విమర్శ
- 20 శాతం తేమ ఉన్న పత్తిని కొనాలని డిమాండ్
- నల్గొండలో తన ఫ్లెక్సీల తొలగింపుపై తీవ్ర ఆగ్రహం
- జాగృతి నేతలతో పెట్టుకోవద్దని ప్రత్యర్థులకు హెచ్చరిక

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రాష్ట్రంలోని సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. రెండు ప్రభుత్వాల హయాంలోనూ ప్రజల కష్టాలు తీరలేదని, ఇదేనా బంగారు తెలంగాణ అని ఆమె ప్రశ్నించారు. బుధవారం నల్గొండలో పర్యటించిన ఆమె, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లాకు గత 12 ఏళ్లుగా కృష్ణా జలాలు పూర్తి స్థాయిలో అందాయో లేదో ఆలోచించుకోవాలని కవిత అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట కూడా అనలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రాజెక్టుల వద్దకు తాము వెళ్తే నిర్వాసితులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవని, ఐసీయూలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను మిగతా 2లో




# మోడీనే టార్గెట్!

- ఢిల్లీ కారు పేలుడు కేసు దర్యాప్తులో బయటపడుతున్న సంచలనాలు
- ఉగ్రకుట్ర వెనుక ఐదుగురు ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు
- జనవరి 26న ఎర్రకోట వద్ద పేలుళ్లకు భారీ స్కెచ్
- ప్రధాని మోదీ ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు
- అరెస్టయిన డాక్టర్ ఫోన్ డేటాతో బట్టబయలైన కుట్ర
- ఎర్రకోట వద్ద నిందితులు పలుమార్లు రెక్కీ చేసినట్లు గుర్తింపు

**నేషనల్‌బ్యూరో బ్యూరో, సిద్దిపేట పవర్:**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు విచారణను వేగవంతం చేయగా, దీని వెనుక ఉన్న భారీ ఉగ్రకుట్ర వివరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గణతంత్ర దినోత్సవం రోజున మిగతా 2లో




# తప్పెక్కడ జరిగింది?

- వారం రోజుల ముందు వరకు బీఆర్ఎస్ వైపు ఆధిక్యత
- జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్‌దేనని ఎగ్జిట్ పోల్స్ ప్రిడిక్షన్
- షాక్‌కు గురవుతున్న గులాబీ పార్టీ నేతలు, కార్యకర్తలు
- కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన అంశాలేమిటి?
- తమను దెబ్బ తీసిన విషయాలు ఏమిటని జోరుగా చర్చ

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ వర్గాల్లో టెన్షన్ పెట్టిస్తోంది. పోలింగ్‌కు వారం రోజుల ముందు వరకు బీఆర్ఎస్ వైపు ఆధిక్యతను చూపిన సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వచ్చే సరికి కాంగ్రెస్ వైపు ప్రిడిక్షన్ ఇచ్చాయి. జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్‌దేనని ఇక్కడ 68 శాతం ఓట్ల ఆధిక్యంతో హస్తం పార్టీ విజయకేతనం ఎగరవేయబోతోందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు షాక్‌కు గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్నా భవిష్యత్‌లో తమ పార్టీకు పునర్ వైభవం రావాలన్నా జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం అనివార్యం అని భావించిన కారు పార్టీకి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కలవరపాటుకు గురి చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో అసలు తప్పెక్కడ జరిగిది? కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన అంశాలేమిటి? తమను దెబ్బ తీసిన విషయాలు ఏమిటనే చర్చ తెలంగాణ భవన్ వర్గాల్లో జోరుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**గేమ్ చేంజర్‌గా సీఎం రేవంత్ రెడ్డి**

మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఏర్పడిన ఉప ఎన్నిక కోసం అందరికంటే ముందే అభ్యర్థిని ప్రకటించి, గల్లీగల్లీకి తిరిగినా బీఆర్ఎస్‌కు ఆరంభంలో అంతా సానుకూ వాతావరణమే కనిపించింది. గెలుపు పక్క మెజార్టీపైనే లెక్క అన్నట్లుగా కొన్ని సర్వే సంస్థలు ప్రీపోల్ ఒపీనియన్స్ లో గులాబీ పార్టీ మెజార్టీపై అంచనాలు వేశాయి. కానీ ఎగ్జిట్ పోల్స్ వచ్చే సరికి ఆ వాతావరణం మిగతా 3లో



## నాగార్జున ఫ్యామిలీకి మంత్రి సురేఖ సారీ

- నాగార్జున ఫ్యామిలీకి క్షమాపణ చెప్పిన మంత్రి కొండా సురేఖ
- అర్ధరాత్రి ట్వీట్ చేసి పశ్చాత్తాపం వ్యక్తం చేసిన మంత్రి
- గతంలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటన
- నాగచైతన్య, సమంత విడాకులపై చేసిన కామెంట్లతో రేగిన వివాదం
- సురేఖపై పరువు నష్టం దావా వేసిన నాగార్జున

02



## అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?

- ఢిల్లీ పేలుళ్లపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీజేపీ ఎంపీ రఘునందన్ ఆగ్రహం
- బీజేపీకి సంబంధం ఉందంటూ పోస్టులు పెట్టడం దేశద్రోహమేనని వ్యాఖ్య
- చేతిలో ఫోన్ ఉందని ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శ

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను బీజేపీకి ఆపాదిస్తూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దేశద్రోహం కిందికే వస్తుందని మిగతా 2లో




## వేములవాడ రాజన్న ఆలయం మూసివేత..

- ఎల్ఈడీ స్క్రీన్లకే మొక్కులు.. భక్తుల ఆగ్రహం
- అభివృద్ధి పనుల కారణంగా ఇనుప రేకులతో అడ్డు ఏర్పాటు
- కార్తిక మాసంలో దర్శనం లేక భక్తుల తీవ్ర నిరాశ
- ముందస్తు సమాచారం ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం



02

## కాళేశ్వరం కమిషన్‌పై విచారణ... జనవరికి వాయిదా

- కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని పిటిషన్
- పిటిషన్ దాఖలు చేసిన మాజీ సీఎస్ జోషి, స్మితా సబర్వాల్, కేసీఆర్, హరీశ్ రావు
- ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు
- ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు 3 వారాల సమయం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

కాళేశ్వరం కమిషన్ విచారణను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ స్మిత సబర్వాల్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మిగతా 2లో

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..


- జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ
- మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం



02

# వ్యభిచార ముఠా గుట్టురట్టు

- చదువు పేరుతో వచ్చి దందా
- మియాపూర్‌లో గుట్టుగా సాగుతున్న వ్యభిచార రాకెట్ బట్టబయలు
- నిర్వాహకుడి సహ ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు
- స్టూడెంట్ వీసాపై వచ్చి దందా నిర్వహిస్తున్న లైబేరియా జాతీయుడు
- కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో వ్యభిచారం
- నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించిన అధికారులు



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

హైదరాబాద్ నగరంలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విదేశీయులు నిర్వహిస్తున్న ఓ వ్యభిచార ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఈ దాడుల్లో నిర్వాహకుడి సహా మొత్తం మిగతా 2లో

# వ్యభిచార ముఠా గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి

ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేశారు.
మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హఫీజ్‌పేట్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేపట్టగా, అక్కడ విదేశీ మహిళలతో వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ రాకెట్‌ను లైబేరియా దేశానికి చెందిన డేరియస్ (28) నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇతడు 2021లో స్టూడెంట్ వీసాపై భారత్‌కు వచ్చి, స్థానికంగా ఓ కళాశాలలో ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నాడు. కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో ఇతడు ఈ దందాను నడిపిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడు డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు, కొన్ని సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించగా, ప్రధాన నిందితుడైన డేరియస్‌ను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



## ఇదేనా బంగారు తెలంగాణ?..

మొదటిపేజీ తరువాయి

ఉంచి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు.
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. భూదాన్ భూములను ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ కుడి కాలువ ఏపీ చేతుల్లో ఉంటే, ఎడమ కాలువను కేంద్రం చేతుల్లో పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని, దానికోసం జాగృతి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతులు పండించిన పత్తిలో 20 శాతం తేమ ఉన్నప్పటికీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
అంతకుముందు, కవిత పర్యటనను పురస్కరించుకుని జాగృతి నాయకులు నల్గొండ పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అయితే, మున్సిపల్ అధికారులు వాటిని రాత్రికి రాత్రే తొలగించడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
"నాకు, మంత్రి కోమటిరెడ్డికి ఎలాంటి పంచాయతీ లేదు. అయినా నా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారు?" అని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్ట్ చేసిన జాగృతి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాను ప్రజా సమస్యలపై పోరాడేందుకే నల్గొండ వచ్చానని, రాజకీయాలు చేసేటప్పుడు బలమైన అభ్యర్థులనే బరిలో దింపుతామని అన్నారు. "జాగృతి నాయకులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదు" అని కవిత వ్యాఖ్యానించారు.







## వేములవాడ రాజన్న ఆలయం మూసివేత..

- ఎల్ఈడీ స్క్రీన్లకే మొక్కులు.. భక్తుల ఆగ్రహం
- అభివృద్ధి పనుల కారణంగా ఇనుప రేకులతో అడ్డు ఏర్పాటు
- కార్తీక మాసంలో దర్శనం లేక భక్తుల తీవ్ర నిరాశ
- ముందస్తు సమాచారం ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు నిరాశ ఎదురైంది. కార్తీక మాసం కావడంతో స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులకు అధికారులు షాక్ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఈ తెల్లవారుజామున ప్రధాన ద్వారాన్ని ఇనుప రేకులతో పూర్తిగా మూసివేశారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో గత నెల రోజులుగా గుడి పరిసరాల్లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దక్షిణ, ఉత్తర ప్రాకారాలు, నైవేద్య శాల, ఈవో కార్యాలయాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రధాన ద్వారాన్ని కూడా మూసివేశారు. ప్రస్తుతం కేవలం అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి స్వామివారికి చతుష్కాల పూజలు నిర్వహిస్తున్నారు. అయితే, కార్తీక మాసం వంటి పవిత్రమైన సమయంలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆలయాన్ని మూసివేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన వారు, స్వామివారిని దర్శించుకోలేక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. చాలామంది భక్తులు ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై కనిపిస్తున్న రాజన్నను చూసి, అక్కడి నుంచే మొక్కుకుని వెళ్లిపోతున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం రాజన్న ఆలయానికి బదులుగా సమీపంలోని భీమేశ్వరాలయంలోనే దర్శన ఏర్పాట్లు చేశారు. కోడె మొక్కులు, ఇతర ఆర్జిత సేవలను కూడా అక్కడే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## కాళేశ్వరం కమిషన్‌పై విచారణ... జనవరికి వాయిదా

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జీఎం మొయినుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది.
ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. అదేవిధంగా ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు నలుగురు పిటిషనర్లకు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు కేసులో అంతకు ముందు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జనవరి రెండో వారానికి మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.

## అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?

మొదటిపేజీ తరువాయి

ఆయన హెచ్చరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించిన 'సర్దార్ఏక్తా పాదయాత్ర'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.
"చేతిలో ఫోన్ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే పేలుళ్లు జరుగుతాయని, దీని వెనుక బీజేపీ ఉందని నీచంగా మాట్లాడుతున్నారు. అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?" అని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్న వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఇలాంటి వారిని సమర్థించవద్దని ఆయన కోరారు. ఢిల్లీలో బాంబులు పేల్చాలని ఒక వర్గం వారు కుట్ర పన్నారని, ఇప్పుడు ఆ నెపాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలను ఖండించాల్సింది పోయి, ఒక రాజకీయ పార్టీపై బురద చల్లడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు.



## నాగార్జున ఫ్యామిలీకి మంత్రి సురేఖ సారీ

- అర్ధరాత్రి ట్వీట్ చేసి పశ్చాత్తాపం వ్యక్తం చేసిన మంత్రి
- గతంలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటన
- నాగచైతన్య, సమంత విడాకులపై చేసిన కామెంట్లతో రేగిన వివాదం
- సురేఖపై పరువు నష్టం దావా వేసిన నాగార్జున

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబానికి క్షమాపణలు తెలిపారు. గతంలో తాను వారిపై చేసిన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ అర్ధరాత్రి ట్వీట్ చేశారు. నాగార్జున కుటుంబాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యల వల్ల వారు బాధపడి ఉంటే చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు కొండా సురేఖ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..!**

కొంతకాలం క్రితం బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో కొండా సురేఖ... అక్కినేని నాగార్జున కుటుంబంపై, ముఖ్యంగా నాగచైతన్య, సమంత విడాకుల అంశంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై నటుడు నాగార్జున తీవ్రంగా స్పందించారు. ఆమెపై పరువు నష్టం దావా కూడా వేశారు. మరోవైపు నాగచైతన్య, సమంత సైతం తమ విడాకులు పరస్పర అంగీకారంతో తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, తమ పేర్లను అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గి క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.





## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

- జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ
- మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.





# మోడీనే టార్గెట్!

మొదటిపేజీ తరువాయి

ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పథకం రచించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కుట్రకు ఐదుగురు ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు సూత్రధారులుగా ఉండటం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.
విచారణలో భాగంగా ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పుల్వామాకు చెందిన ఇతడిని విచారించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. అధికారులు అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డేటాను విశ్లేషించగా, అతడు మహమ్మద్ ఉమర్‌తో కలిసి పలుమార్లు ఎర్రకోట వద్ద రెక్కీ నిర్వహించినట్లు తేలింది. జనవరి 26న ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలో అక్కడ భారీ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌కు, ఢిల్లీ కారు పేలుడు ఘటనకు సంబంధం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. డాక్టర్ ముజమ్మిల్ ఫోన్ నుంచి లభించిన ఆధారాలతో ఈ కేసు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. ఈ కుట్రలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వారి ప్రణాళికలు ఏమిటి? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. చదువుకున్న వైద్యులే ఉగ్రవాదం వైపు మళ్లడంపై భద్రతా ఏజెన్సీలు దృష్టి సారించాయి.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ హల్‌చల్.. పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు!

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. మంగళవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా హల్‌చల్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. పోలీసులు చెప్పినా వినకుండా యూసుఫ్‌గూడ వద్ద ఓ ఫంక్షన్‌హాల్లోకి అనుచరులతో ఆయన దూసుకెళ్లారని ఫిర్యాదు అందింది. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



# అప్పుల బాధతో యువ వ్యాపారి ఆత్మహత్య..!

- **నేను పోతున్నా.. పిల్లలను చూసుకోండి ' బావ '..**

**సిద్దిపేట పవర్, దుబ్బాక, నవంబర్ 12:**





అప్పుల బాధతో యువ వ్యాపారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూంపల్లి ఎస్సై హరీష్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్ పేట భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన దావత్ రాజు(36) అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాల నుండి దుబ్బాకలో బ్యాంగిల్స్ స్టోర్ నడుపుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇటీవల షాపు నడవకపోవడంతో షాపు పెట్టేందుకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో, ఆయనకు వచ్చే డబ్బులు సమయంలో రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం భూంపల్లి లో ఓ ఫంక్షన్ హాల్లో విందు ఉందని ఇంట్లో చెప్పి వెళ్లిన రాజు సాయంత్రం 5 గంటలలోపు మోతే గ్రామంలో వారి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బావ అయిన లక్ష్మణ్ కు ఫోన్ చేసి " బావ పిల్లలు జాగ్రత్త " అని ఫోన్ పెట్టేశాడు. అనుమానంతో కుటుంబ సభ్యులతో కలిసి మోతెకు వెళ్లగా దూరానికి శివమై కనిపించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ప్రశ్నించే గొంతుకనై, మీ గొంతుకగా బార్ కౌన్సిల్ లో గళమెత్తుత

- **హైకోర్ట్ అడ్వకేట్, బార్ కౌన్సిల్ అభ్యర్థి శ్రీ రాపోలు భాస్కర్**

రాబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ బార్ కౌన్సిల్ అభ్యర్థి, హైకోర్టు అడ్వకేట్ "రాపోలు భాస్కర్" తన అభ్యర్థిత్వాన్ని తెలియజేయుటకు సిద్దిపేట కోర్టుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఆశీర్వదించడం జరిగింది.

**వారితో పాటు........**

సిద్దిపేట కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ రమేష్, జాయింట్ సెక్రటరీ వెంకట చారి, సీనియర్ న్యాయవాది సాయిబాబా, మేకల నర్సింహారెడ్డి , జనార్ధనరెడ్డి, ట్రెసరర్ రాము, లైబ్రరీ సెక్రటరీ రామకృష్ణ, అడ్వకేట్స్: రాజ్యలక్ష్మి, సూర్యకళ, శ్రీనివాస్, ప్రవీణ్, సయ్యద్ రియాజుద్దీన్, పునీందర్, చంద్రశేఖర్, కార్తీక్, మణికంఠ, వేణుగోపాల్, రవిబాబు సీనియర్ అడ్వకేట్స్, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు

**సికింద్రాబాద్, నవంబర్ 12 (సిద్దిపేట పవర్ ):**

దేశంలోనే మొదటిసారిగా కిమ్స్ సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్‌కు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డు లభించింది. రోబోటిక్ అసిస్టెడ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు పదివేలకు పైగా చేయడం, పరిశోధన పత్రాలు, హాస్పిటాలిటీ అంశాలను పరిగణనలోకి తీసుకుని స్ట్రైకర్ కంపెనీ ఈ అవార్డును అందజేసింది .ఈ సందర్భంగా కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఏ.వి. గురవారెడ్డి మాట్లాడుతూ...ఈ అవార్డు రావడం హైదరాబాద్‌కే గర్వకారణం. ఆధునిక టెక్నాలజీని మరింత అందుబాటు ధరల్లో ప్రజలకు చేరవేస్తాం అన్నారు. కిమ్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ బి. భాస్కర్‌రావు మాట్లాడుతూ, వైద్యరంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కిమ్స్ గ్రూప్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ కుషాల్, డాక్టర్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# తప్పెక్కడ జరిగింది?

**మొదటిపేజీ తరువాయి**

పూర్తిగా తారుమారు అయింది. పోలింగ్ ముగిశాక ఇచ్చిన అంచనాల్లో మెజార్టీ సర్వే సంస్థలు కాంగ్రెస్ గెలవబోతున్నట్లు తేల్చాయి. ఈ పరిణామం బీఆర్ఎస్ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది. నిజానికి ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్, కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వైపు నుంచి కేటీఆర్, కాంగ్రెస్ వైపు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంపై బాకీ కార్డు, ఆరు గ్యారెంటీల విఫలం, నిరుద్యోగం, వంటి సమస్యలను తెరమీదకు తీసుకువస్తూ కాంగ్రెస్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేసింది బీఆర్ఎస్. కానీ ఆఖరి దశలో రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్డు షోలు, బైక్ ర్యాలీలతో పాటు క్షేత్రస్థాయికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంలో ఈ ఎన్నికలో గేమ్ చేంజర్ గా మారారనే టాక్ వినిపిస్తోంది. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అధిగమించడంలో, బీఆర్ఎస్ అవకాశాలను భారీగా దెబ్బతీయడంలో రేవంత్ రెడ్డి స్ట్రాటజీ వర్కౌట్ అయిందనే చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగా కేసీఆర్ ఫామ్‌హౌస్ కే పరిమితమై ఒక్కసారి కూడా జూబ్లీహిల్స్ వైపు చూడకపోగా రేవంత్ రెడ్డి మాత్రం వరుస ప్రచారంతో క్యాడర్ లో జోష్ నింపడంతో పాటు ఓటర్లను తమ వైపు మళ్లించుకోగలిగారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.




జూబ్లీహిల్స్‌లో జరిగింది పేరుకే ఉప ఎన్నిక అయినా ఇక్కడ ప్రధాన పార్టీల మధ్య సాధారణ ఎన్నికల కంటే హై రేంజ్ ఫైటింగ్ నడిచింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్లు డైలాగ్ వార్ సాగింది. ప్రచారం చివరి మూడు రోజులు భారీ హైడ్రామానే నడిచింది. స్టేట్ ఫ్యూచర్ పాలిటిక్స్ కు రూట్ మ్యాప్‌గా మారుతాయని భావిస్తున్న జూబ్లీహిల్స్ పోలింగ్ విషయంలోని సమీకరణాలు ఆసక్తిరేపుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ బలహీన పడి బీజేపీ బలపడితేనే అది కాంగ్రెస్ కు అనుకూలంగా మారే అవకాశం ఉందని చర్చ చాలా కాలంగా జరుగుతోంది. అలా కాకుండా బీజేపీ వీక్ అయి బీఆర్ఎస్ బలపడితే అది కాంగ్రెస్ కు నష్టం చేకూర్చుతుందనే టాక్ ఉంది. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోని ఎగ్జిట్ పోల్స్ అంచనాలో మాత్రం బీజేపీ బలహీన పడినా కాంగ్రెస్ దూసుకుపోవడం ఖాయం అనే అంచనాలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఓట్ షేర్ చాలా వరకు బీఆర్ఎస్ కు టర్న్ అయిందని ఈ రెండు పార్టీల ఓట్ షేర్ పోగైనా ఇంకా కాంగ్రెస్ వైపే హెడ్జ్ ఉండటం ఆసక్తికర పరిణామం అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్ ఫలితాలే నవంబర్ 14న జరగబోయే కౌంటింగ్ రోజున రిపీట్ అవుతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంటే ఎగ్జిట్ పోల్స్ ఏమి ఎగ్జాట్ పోల్స్ కావని అంతిమ విజయం తమదేనని బీఆర్ఎస్ శ్రేణులు లెక్కలు వేసుకుంటున్నాయి. మొత్తం జూబ్లీహిల్స్ పోరులో వాస్తవంగా పై చేయి ఎవరిది అనేది తేలాలంటే రేపటి వరకు ఆగాల్సిందే.

# రణభేరి మహాసభ విజయవంతం చేయాలని పిలుపు

- **మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య**

**సిద్దిపేట, నవంబర్ 12:**

రణభేరి మహాసభ విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నవంబర్ 23న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో జరగనున్న మాలల రణభేరి మహాసభ కర పత్రాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర అధ్యక్షుడు రాయలే బూరుగుల వెంకటేశ్వర్లతో కలసి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాత రోస్టర్ పాయింట్ల కేటాయింపులో 5% కేటాయించిన గ్రూప్-3లోని మాలలకు 1% ఉన్న గ్రూప్-1 కులాల కంటే విద్య, ఉద్యోగాల్లో తక్కువ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నిస్తూ, ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతం పెంచడం, ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు, మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధుల కేటాయింపు, అలాగే మాలల సామాజిక భవనం ఏర్పాటు వంటి డిమాండ్ల సాధన కోసం రణభేరి మహాసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ నాయకులు పురుషోత్తం మాట్లాడుతూ, మండలాల వారీగా మాలలను చైతన్యపరచి మహాసభకు భారీగా హాజరయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ర్యాలీగా వెళ్లి పూలమాలలు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జంజీరపు ఎల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మల విజయ్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాకనాటి రాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మ వారి రమేష్, సంయుక్త కార్యదర్శి ఎం. ఎల్లేష్, వైస్ ప్రెసిడెంట్ మెరుగు వై.ఎస్., సీనియర్ నాయకులు మంద పాండు, బొమ్మల ప్రవీణ్, దుబ్బాక అధ్యక్షుడు పాకనాటి సునీల్, పట్టణ ప్రధాన కార్యదర్శి దువల వంశీ, ఉపాధ్యక్షులు సందీప్, మధు శేఖర్, వెంకటయ్య, నరసింహులు, బొమ్మల సాయి, సుకూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# నిమోనియా ముందస్తు గుర్తింపుతో ప్రాణాలు కాపాడవచ్చు

- **మెడికవర్ ఆసుపత్రి చీఫ్ పల్మనాలజిస్ట్ డాక్టర్ గంగాధర్ రెడ్డి మల్లూ**
- **ప్రపంచ నిమోనియా దినోత్సవం**

**సికింద్రాబాద్, నవంబర్ 12 ( సిద్దిపేట పవర్ ) :**



నిమోనియా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే తీవ్రమైన ఇన్ఫెక్షన్‌అని, దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారితీస్తుందని సికింద్రాబాద్ మెడికవర్‌హాస్పిటల్స్‌చీఫ్‌పల్మనాలజిస్ట్‌డా. గంగాధర్‌రెడ్డి మల్లూ అన్నారు. ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.... వృద్ధులు, మధుమేహం, గుండె వ్యాధులతో ఉన్నవారిలో ప్రమాదం అధికమని తెలిపారు. జ్వరం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, అలసట, ఆకలి తగ్గడం ప్రధాన లక్షణాలుగా పేర్కొన్నారు. ఛాతీ ఎక్స్ రే, రక్తపరీక్షల ద్వారా నిర్ధారణ చేసి యాంటీబయాటిక్స్, విశ్రాంతి, ఆక్సిజన్‌సపోర్ట్‌ద్వారా చికిత్స అందించవచ్చన్నారు.సకాలంలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే నిమోనియా పూర్తిగా నయం అవుతుంది. చేతులు శుభ్రంగా ఉంచడం, పొగతాగడం మానడం, ఫ్లూ, న్యూమోకోకల్‌టీకాలు వేయించుకోవడం ద్వారా నివారణ సాధ్యమవుతుంది, అని ఆయన తెలిపారు.



# సికింద్రాబాద్‌లో అంతర్రాష్ట్ర గంజాయి రవాణా గుట్టు రట్టు

- **రూ9.41 లక్షల విలువ కలిగిన 18కిలోల డ్రై గంజాయి స్వాధీనం**

**సికింద్రాబాద్, నవంబర్ 12 ( సిద్దిపేట పవర్ ) :**

రాయగడ (ఒడిశా) నుంచి ముంబయికి గంజాయి తరలిస్తున్న ఇద్దరు బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులను సికింద్రాబాద్ రైల్వే పోలీసు (జీఆర్‌పీ), రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) సంయుక్తంగా పట్టుకున్నారు. నిందితులు అజయ్‌కుమార్ (35), రీనా దేవి (40) వద్ద నుండి 18.823 కిలోల పొడి గంజాయి (విలువ రూ.9.41 లక్షలు), రెండు మొబైల్ ఫోన్లు, రైల్వే టికెట్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు పంకజ్ పరారీలో ఉన్నాడు.బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే పోలీసులు వివరాలు వెల్లడించారు.రాయగడ ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి ముంబయిలో విక్రయిస్తే ఒక్క ట్రిప్‌కు రూ.5,000 ఇస్తానని పంకజ్ వీరితో ఒప్పందం చేసుకున్నట్లు విచారణలో తెలిసింది. అతడు ఇచ్చిన సూచనల మేరకు రాయగడ-దువ్వాడ మార్గంలో ప్రయాణించి, ముంబయి ఎల్.టీ.టీ. ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 18519)లో సికింద్రాబాద్ వరకు గంజాయి సూట్‌కేసులతో వచ్చారని పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో (ప్లాట్‌ఫాం నంబర్ 10) తనిఖీ సమయంలో వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసు సిబ్బంది ఆరా తీసి, గంజాయి ఉన్నట్లు వీరు అంగీకరించారు. ఈ ఆపరేషన్‌ను రైల్వే ఇన్స్పెక్టర్ బి.సాయి ఈశ్వర్ గౌడ్ ,రైల్వే ఎస్.ఐ ఎస్.వి. సుబ్బారెడ్డి పర్యవేక్షణలో, ఆర్‌పీఎఫ్ అధికారి భవానీశంకర్ సరస్వత్ ఐపీఎఫ్/ ఎస్పీ బృందం సహకారంతో నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని రైల్వే ఎస్పీ చందన దీప్తి , డీఎస్ఆర్పీ ఎస్.ఎన్. జావేద్ పర్యవేక్షించగా, రైల్వే అండ్ రోడ్డు సేఫ్టీ ఐజీ కె.రమేష్‌నాయుడు అధికారులు బృందాన్ని అభినందించారు.

# ప్రతీ విద్యార్థికి పదవ తరగతి ఎంతో ముఖ్యం

- **బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య**
- **పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందచేత**

**చేర్యాల, నవంబర్ 12 (సిద్దిపేట పవర్)**

చేర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు భారాస రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య గారు SSC ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ విద్యార్థికి పదవ తరగతి ఎంతో ముఖ్యం అని ప్రతీ ఒక్కరూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలి అని దిశానిర్దేశం చేశారు..అదే విధంగా విద్యార్థులు మద్యం, గంజాయి వంటి వ్యసనాల బారిన పడకుండా కష్టపడి చదవాలని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులకు, పాఠశాలకు, పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలని సూచించారు. అందుకోసం అవసరమైతే తన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారాస నాయకులు శివగారి అంజయ్య, భూమిగారి రాజేందర్, రామగాళ్ల నరేష్, దామోదర్. ఓగ్గు శ్రీశైలం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పిడుగుపడి ప్రాణాపాయంలో విద్యార్థి..

- రూ18లక్షల ఆర్థిక సాయం అందించి, ఆదుకున్న మంత్రి అడ్లూరి
- యశోద ఆసుపత్రి నుంచి బాధిత విద్యార్థి డిశ్చార్జి...

**సికింద్రాబాద్, నవంబర్ 12 (సిద్దిపేట పవర్):** పిడుగు పాటుకు గురై తీవ్రంగా గాయపడిన ఓ విద్యార్థిని స్టేట్ సోషల్ వెల్ఫేర్ మినిష్టర్ అడ్లూరి లక్ష్మణ్ స్పందించి, ఆర్థిక సాయం అందించి, సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి లో వైద్యం చేయించడానికి సహకరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న బొల్లె హిమేష్ చంద్ర అనే విద్యార్థి గత సెప్టెంబర్ నెలలో హాస్టల్ బిల్డింగ్ పై ఆరేసిన బట్టలు తీసుకు రావడానికి వెళ్ళినపుడు పిడుగు పడడంతో 60 శాతం ఒళ్ళంతా గాయాలు అయ్యాయి. దాంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడ మెరుగైన వైద్యం లేకపోవడంతో అధికారులు,తల్లిదండ్రులు మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి విద్యార్థికి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లమని మంత్రి ఆదేశించారు. దాంతో వైద్యాధికారులు హుటాహుటిన యశోద ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ ఐదు సార్లు ఆస్పత్రికి వచ్చి విద్యార్థిని పరామర్శించారు. విద్యార్థి కుటుంబ దైన్యస్థితిని చూసిన మంత్రి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తరపున పూర్తి వైద్య ఖర్చులు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్ కుటుంబసభ్యులకు వైద్య ఖర్చులు రూ.18 లక్షల చెక్కును అందచేశారు. కోలుకున్న విద్యార్థి హిమేశ్ చంద్రను ఆసుపత్రినుంచి బుధవారం డిశ్చార్జి చేశారు. పేదరికంలో ఉన్న తమను ఆదుకున్న మంత్రికి..సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులకు విద్యార్థి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# అంగన్వాడీ విద్యార్థులకు ఆటవస్తువుల పంపిణీ

- చిన్నారుల మధ్య స్కై ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ బర్త్ డే వేడుకలు

**సికింద్రాబాద్, నవంబర్ 12 (సిద్దిపేట పవర్):** సికింద్రాబాద్ పరిధిలో రాణిగంజ్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల మధ్యలో స్కై ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కుమారి. ఓ. పావని జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు ఇష్టమైన వివిధ రకాల తినుబండారాలను, ఆటవస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమములో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సరిత, ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.










# విధి వంచిత మర్పడగ గ్రామవాసి దబ్బెర రేణుకను ఆదుకోండి

భగవంతుడు ఏమాత్రం కనికరం చూపని ఈ అభాగ్యురాలిని మానవత్వంతో ఆదుకోవాల్సిందిగా స్త్రీ జాగరణ సమితి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ కోరారు. స్థానిక మర్పడగ గ్రామం, కొండపాక మండల నివాసి అయిన దెబ్బెర రేణుక ఏడు సంవత్సరాల క్రితమే భర్తను పోగొట్టుకొని ఇద్దరు చిన్న పిల్లలతో గ్రామ పెద్దలు ఇచ్చిన 60 గజాల స్థలంలో గుడిసె వేసుకొని కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. శనివారం 8వ తేదీ కులస్తులతో కలిసి బోనాలు తీస్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు గుడిసె అంటుకొని కాలిపోయింది. చుట్టుపక్కల వారి సహాయంతో వెంటనే మంటలు అర్పడం జరిగింది. ఇదే సంవత్సరం జూన్ నెలలో గాలివానులకు గుడిసె కూలిపోయి రేణుక ఆమె ఇద్దరు పిల్లలు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పుడు కూడా ప్రభుత్వ అధికారులు పంచనామ చేసినప్పటికీ ఆమెకు ఎలాంటి సహాయం అందలేదు. విధి పగ పట్టినట్టుగా మరొక సారి గుడిసె వేసుకొని జీవిస్తూ ఉండగా, అది కూడా కాలిపోవడంతో కట్టుబట్టలతో ఇద్దరు చిన్న మగ పిల్లలతో వీధిపాలైంది .ఆశ్రయం పొందడానికి ఎక్కడ వీలులేని పరిస్థితిలో అదే గుడిసెలో ఉంటూ రాత్రి దగ్గరి బంధువుల ఇంట్లో తలదాచుకుంటుంది. ఇది చాలదు అన్నట్లు 9 సంవత్సరాల పెద్ద కొడుకు ప్రమాదవశాత్తు ఆటోలో నుండి కిందపడిపోవడం తో దెబ్బలు తగిలాయి.ఆమె జీవితం చూసినప్పుడు హృదయం తల్లడిల్లిపోయింది. పంచనామా జరిపిన కొండపాక రెవెన్యూ అధికారులు తక్షణ సాయంగా 10 కిలోల బియ్యము, నూనె, పప్పు అందించారు. ఐదు రోజులుగా విది లేని పరిస్థితిలో అదే గుడిసెలో ఉంటుంది.ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తే ఆమె జీవితం మరింత దుబ్బరంగా మారే అవకాశం ఉంది ,చలికాలం కూడా కావడంతో ఐదు దాటితే చలికి ఆ గుడిసె ప్రాంగణం లో కూడా ఉండలేని పరిస్థితి. దయచేసి మానవత్వంతో రేణుకకు ,ఆమె ఇద్దరు చిన్న పిల్లలకు ఒక గూడు నిర్మించి ఇవ్వడానికి విశాల హృదయంతో దాతలు సహకరించాలని మనవి.స్త్రీ జాగరణ సమితి ఆమె సురక్షితంగా ఉండే వరకు ఆమెకు తోడుగా ఉంటుందని లక్కిరెడ్డి విజయ తెలియజేశారు. చిన్న రేకుల షెడ్డుకు కావలసిన ఇసుక, రేకులు ,సిమెంటు లేదా డబ్బు రూపంలో అయినా సరే నేరుగా రేణుక కు అందించి ఆమె జీవితాన్ని నిలపడంలో మీ వంతు సహాయాన్ని అందించి,దయచేసి మానవత్వాన్ని చాటుకోగలరు. స్త్రీ జాగరణ సమితి కోరగానే రేణుకకు సరుకులు అందించి సహకరించిన ఇర్రి ఉమా సురేష్ రెడ్డి, సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలికి అభినందనలు. దీనిని సామాజిక బాధ్యతగా తీసుకొని మానవత్వంతో స్పందించగలరని మనవి.







# తెలుగు రాష్ట్రాల్లో డిజిటల్ భద్రత మరింత బలోపేతం

- మీడియా తో టెలికాం అదనపు డీజీ
- దొంగిలించిన, పోగొట్టుకున్న ఒక లక్ష మొబైల్ ఫోన్ల రికవరీ

**సికింద్రాబాద్, నవంబర్ 12 (సిద్దిపేట పవర్):**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొబైల్ ఫోన్ వినియోగదారుల డిజిటల్ భద్రత బలోపేతం చేస్తూ పౌరుల రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని టెలికాం అదనపు డీజీ నాగేష్ రావు తెలిపారు. బుధవారం సీటీవోలోని కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.... సంచార్ సాథీ పోర్టల్ ద్వారా తెలంగాణా రాష్ట్రంలో ఇప్పటి వరకు పోగొట్టుకున్న, దొంగిలించబడిన 1,02,148 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసికుని సంబంధిత బాధితులకు అందించినట్లు వెల్లడించారు. ఇందులో తెలంగాణా పోలీసులు దేశంలోనే ముందున్నారని అన్నారు. ఇదే పోర్టల్లోని నో యువర్ మొబైల్ కనెక్షన్ సేవ ద్వారా పౌరులు తమ పేరుతో జారీ అయిన ఫోన్ నంబర్లను పరిశీలించి అనధికార సిమ్ లను తొలగించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఏపీ, తెలంగాణాలో 25.18 లక్షల మొబైల్ నంబర్లు రిపోర్ట్ కాగా 23.65 లక్షల ఫిర్యాదులు పరిష్కరించినట్లు చెప్పారు. వ్యక్తిగత వివరాలను దొంగిలించే కాల్స్, ఆర్థిక మోసాలను నివారించడంలో బాగంగా 2 ప్రధాన సీమ్ బాక్స్ సైబర్ మోసాలను గుర్తించి ద్వంసం చేశామన్నారు. మోసపూరిత లావాదేవీలను నివారించేందుకు 700కు పైగా ఆర్థిక సంస్థలు, 76 కో ఆపరేటివ్ బ్యాంకులను ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ మాడ్యుల్ లో ఆన్ బోర్డు చేసినట్లు తెలిపారు. దూర సంచార్ శాఖ ఏఐ, డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ద్వారా 38.49,493 అనుమానాస్పద మొబైల్ మొబైల్ నంబర్లను గుర్తించి 17,27,098 నంబర్లను తొలగించి 282 సిమ్ విక్రయ కేంద్రాలను బ్లాక్ లిస్టులో పెట్టి కొందరిపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు, చెప్పారు. మొబైల్ ఫోన్ వినియోగదారులందరూ సంచార్ సాథీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పారు. డీబీఎన్ మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టుల కింద 223 గ్రామాల్లో 188 ఫోర్జీ టవర్లు, ఎల్ డబ్ల్యూఈ ఫేస్1,2 కింద 140 గ్రామాల్లో 140 టవర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరలు ఈశ్వర్, హేమంత్రత్వే, సత్యనారాయణ, బాస్కర్ రావు, డైరెక్టర్లు రాఘవరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోలు లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు...

- అన్ని సెంటర్లలో టార్పాలిన్స్ అందుబాటులో ఉంచాలి..
- అన్ని మిల్స్ వద్ద ఒక రెవెన్యూ అధికారి ద్వారా పర్యవేక్షణ....
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...

**మెదక్ (సిద్దిపేట పవర్) ప్రతినిధి**

కలెక్టరేట్లో కొనుగోలు కేంద్ర నిర్వాహణపై అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి సివిల్ సప్లై మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖ, డి ఆర్ డి ఏ, అధికారులతో కలెక్టర్ సమీక్ష జిల్లాలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేస్తూ ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలని, జిల్లాలో ప్రస్తుతం వాతావరణ అనుకూల ప్రభావంగా ఉన్నందున కొనుగోలు వేగం పుంజుకుని రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. 69 రైస్ మిల్లుల వద్ద ఒక రెవెన్యూ ఆఫీసర్ నియమించి లారీల దిగుమతి పర్యవేక్షణ చేసే విధంగా కార్యాచరణ తయారు చేయాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం స్టాక్ ఉన్న టార్పలిన్ వివరాలను సమగ్ర సమాచారంతో ఫార్మాట్ రూపొందించాలన్నారు కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలను పెంచి వేగంగా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్ ఉన్న మండలాలలో రైతులు ధాన్యం శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణా లారీల విషయంలో సంబంధిత ట్రాన్స్పోర్ట్ అధికారులతో సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. సీఎంఆర్ పెండింగ్ విషయంలో పౌరసరఫరాల అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి, దేవకుమార్ ,జిల్లా పౌర సరఫరాధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, మార్కెటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు...





## అక్షరాల శ్రద్ధాంజలి అందె శ్రీ గారికి

జననము జననము జననము,
నీ పాటకు మళ్లీ జన్మము...
నీ దేహానికి ఆ మరణము,
నీ పాటకు లేదు మరణము...

నీ కలమే ఆయుధమయ్యే,
నీ గొంతుక తూటాలయ్యే,
ప్రజల సమస్య యుద్ధభూమిలో,
నీ పాటే జయకేతనమయ్యే...

తెలంగాణ మాగానికి నీ పాట నాగలి,
తెలంగాణ పైరుకు నీ అక్షరాలే ఎరువు...
ప్రతి పల్లెలో మార్మోగే నీ స్వరం,
మానవతకు అంకితం అవ్వెను నీ జీవనం...
నీ స్వరమే సింహనాదమయ్యే,
నీ తాళమే తుపానైయ్యే,
న్యాయం కోసం నినదించే జనంలో
నీ పాటే దారిదీపమయ్యే.

నీ రాగమే రక్తంలో నడిచే జ్వాల,
నీ మాటే మార్పు తెచ్చే దిక్సూచి.
అణగారిన ఆత్మలకి నీవు ఆశ,
అధికార దుర్మార్గానికి నీవు శాపం.
నీ స్వరానికే సరిహద్దులు లేవు,
నీ ఆత్మలో అగ్నిజ్వాలలు వెలుగుతూనే ఉంటాయి.
ప్రతీ మౌనం తుడిచే ప్రతిధ్వనివి నీవు,
నిజం కోసం నడిచే జాతి స్వరమవుతావు.

Written by: Merugu
(Rajasekhar, B.A., LL.B. )



# అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

- శ్రీ కొండపోచమ్మ అమ్మవారి 24వ వార్షికోత్సవ ఉత్సవం ముగిసింది
- కొండపోచమ్మ ఆలయ చైర్మన్ కప్పర అనుగీత
- తాజా మాజీ చైర్మన్ గర్నేపల్లి రజిత రమేష్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ సమీపంలో వెలసిన ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ కొండపోచమ్మ అమ్మవారి 24వ ఉత్సవాలు శివపార్వాతులు కళ్యాణం బుధవారం తో ముగిసిందని కొండపోచమ్మ ఆలయ చైర్మన్ కప్పర అనుగీత గ్రామ తాజా మాజీ సర్పంచ్ గర్నేపల్లి రజిత రమేష్ ఆలయ డైరెక్టర్లు తాడూరి వెంకట్ రామిరెడ్డి చెక్కల నరేష్ ఆశయ్య గడ్డం రాజు పి. నర్సిములు యం. కృష్ణ జి. లక్ష్మన్ యం. అనసూయ ఈవో రవికుమార్ అమ్మవారి వార్షికోత్సవము కన్నుల పండుగ అంగరంగ వైభవం గా నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కొండపోచమ్మ అమ్మవారి 24వ వార్షికోత్సవము అంగరంగ వైభవంగా ఉత్తర దిశలో ఉన్నా శితల దేవి శ్రీ కొండపోచమ్మ అమ్మవారి మొదటి రోజు గణపతి పూజ పుణ్యాహచనము అఖండ దేవస్థాపన బూత్వి గవరణము అగ్ని ప్రతీస్థాపన మూలమంత్ర హావనము అభిషేకం శితాళాతోరణము నామముతో జగత్ ప్రసిద్ధి రెండవ రోజు మహిమ కృపలు ఆరాధ్యదైవం నిత్య పూజలు అందుకొనుచు భక్తుల కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి పాత కాలపు పూజ హావనము మూల మంత్ర హోమము స్థాపిత దేవత పూజ సామూహిక కుంకుమర్చన మంగళహారతి మూడోవ రోజు కన్నుల పండుగ అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరిగిందని పేర్కొన్నారు. భక్తులు కొండపోచమ్మ అమ్మవారి కృపా కటాక్షం పొందాలని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ అసిస్టెంట్ మోహన్ రెడ్డి జూనియర్ అసిస్టెంట్ పుల్లం కనకయ్య పోలీస్ సిబ్బంది అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

